క్లుప్తంగా

బీజేపీ నాయకుల ఆందోళన



పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: బీజేపీ నాయకుడు పాయల్ శరత్‌ను పోలీసులు అరెస్టు చేసి టూటౌన్‌కు తరలించడంతో ఆ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం డీఈఓ కార్యాలయంలో డీఎస్సీ అభ్యర్థులకు మద్దతు ప్రకటించిన పాయల్ శరత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న ఆ పార్టీ నాయకులు పాయల్ శరత్‌ను వెంటనే విడుదల చేయాలని పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు.

'చెన్నూర్ ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం'



మాట్లాడుతున్న మాల సంక్షేమ సంఘం నాయకులు

ఇచ్చోడ: చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిపై కొన్ని సంఘాల నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని మాల సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఇటీవల ఆదిలాబాద్‌లో జరిగిన కుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి హాజరై మాలల ఐకత్యకు పిలుపునిచ్చారని తెలిపారు. ఈ విషయంపై సంఘాల నాయకులు ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వర్గీకరణ రాజ్యాంగ బద్ధంగా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొజ్జ లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు బత్తుల ఉషన్న, రాజ్‌కుమార్, మైల మహేశ్, చింత స్వామి, శంకర్ పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి



అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ అజయ్

నేరడిగొండ: ప్రజలకు పరిసరాల పరిశుభ్రతతోపాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి సద్దాం, ట్రైనర్ అజయ్ అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టే కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో పర్యటిస్తూ పారిశుధ్యం, రోగాలు దరిచేరకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో హెచ్‌ఈవో పవార్ రవీందర్, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాస్, స్వర్ణలత, వైద్యులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయండి

నార్నూర్: ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మెస్రం శేఖర్‌బాబు కోరారు. మంగళవారం ఆయన డీఈవో ప్రణీతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాదిగూడ మండలంలోని మారేగావ్, కొలామా, బుద్దగూడ, డొంగర్‌గావ్, రాంపూర్, కునికసా, పొనూర్, కొటాల, చిన్నకుండి గ్రామాల్లోని పాఠశాలలతోపాటు విద్యార్థులు అధికంగా ఉన్న లోకారి(బి), మెడిగూడ ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదివాసీ గిరిజనులు అధికంగా ఉండే ఈ మండలంలో టీచర్ల పోస్టులు భర్తీ చేసి పేద విద్యార్థులకు విద్యనందించేలా కృషిచేయాలన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయ సంఘ నాయకులు ఉన్నారు.

బంద్ విజయవంతం

ఇచ్చోడ: మహ్మద్ ప్రవక్తపై ఓ వ్యక్తి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ముస్లిం, మైనార్టీ వర్గాలు మండల కేంద్రంలో మంగళవారం పిలుపునిచ్చిన బంద్ విజయవంతమైంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఇచ్చోడ సీఐ భీమేశ్, ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

నేడు సోయా కొనుగోళ్లు ప్రారంభం

నేరడిగొండ: మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాంలో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ బుధవారం సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు చైర్మన్ సాబ్లే కిశోర్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా ఉదయం 11 గంటలకు కొనుగోళ్లు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

తెరుచుకోని గ్రంథాలయం

- మూడేళ్లుగా లైబ్రేరియన్ పోస్టు ఖాళీ
- కార్యాలయం మూసివేత
- ఇబ్బందుల్లో నిరుద్యోగులు
- పట్టించుకోని అధికారులు



మండల కేంద్రంలోని గ్రంథాలయం

నార్నూర్: మండల కేంద్రంలోని గ్రంథాలయానికి రెగ్యులర్ లైబ్రేరియన్ లేక తెరుచుకోవడం లేదు. సుమారు 5 వేలకు పైగా జనాభా ఉన్నా గ్రామ పంచాయతీలో గ్రంథాలయం సరిగా తెరుచుకోకపోవడంతో పాఠకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే నిరుద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత మూడేళ్లుగా లైబ్రేరియన్ పోస్ట్ ఖాళీగా ఉంది. వారానికి ఒక్కరోజు మాత్రమే అప్పుడప్పుడు ప్రైవేట్ వారితో గ్రంథాలయాన్ని తెరుస్తున్నారు. గ్రంథాలయం సెస్‌కు పంచాయతీకి ప్రజలు డబ్బులు కడుతున్నా తెరుచుకోకవడంపై పలువురు మండిపడుతున్నారు. అదేవిధంగా గ్రంథాలయానికి చెత్త కుప్పల నుంచి వెళ్లాల్సిన పరిస్థితి. గత పదేళ్ల క్రితం గ్రంథాలయాన్ని అంబేద్కర్ భవన్ కమ్యూనిటీ భవన్ నుంచి ఎంపీపీఎస్ పాఠశాలకు మార్చారు. అప్పుడు ప్రారంభానికి వచ్చిన లైబ్రేరియన్ ఇప్పటి వరకు పత్తా లేకుండా పోయారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో అటెండర్‌గా పనిచేసే జాడే నాందేవ్ తాత్కాలికంగా ప్రతిరోజు తెరిచేవారు. ఆయన కూడా పట్టించుకోకపోవడంతో గత పదేళ్లుగా తెరుచుకోవడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉంది గ్రంథాలయం పరిస్థితి. ఉన్నతాధికారులు పట్టించుకుని లైబ్రేరియన్ నియమించి, గ్రంథాలయం ప్రతీరోజు తెరుచుకోనేలా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి..



గ్రంథాలయం పరిస్థితిని సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రతీరోజు తెరుచుకోనేలా చర్యలు తీసుకుంటాం. పుస్తకాలను నిరుద్యోగులకు అందుబాటులో ఉండేలా చూస్తాం. లైబ్రేరియన్ ఉన్నారా లేదా విషయం నాకు తెలియదు.

– పవార్ అనిత, ఎంఈవో, నార్నూర్

ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఆదిలాబాద్‌టౌన్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ అర్బన్ ఎంఈవో సోమయ్యకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాల రాములు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు గత 23 ఏళ్లుగా విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వారిని గుర్తించడం లేదని తెలిపారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. విద్యార్థులకు కోడిగుడ్లు పెట్టకుంటే హెచ్ఎంలు విధుల నుంచి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఎంఈవోకు విన్నవించారు. మధ్యాహ్న భోజన కార్మికులు రాంబాయి, లక్ష్మి, లసుంబాయి, నాజియ, యాస్మిన్, తారబాయి తదితరులు ఉన్నారు.

జగదాంబ దేవిని దర్శించుకున్న గజేందర్



గజేందర్‌ను సన్మానిస్తున్న ఆలయ సభ్యులు

నేరడిగొండ: మండలంలోని బుగ్గారంలో మంగళవారం జగదాంబ దేవిని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆయన్ను సన్మానించారు. నేరడిగొండ మండల కన్వీనర్ ఆడే వసంతరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రూప్‌సింగ్, జిల్లా నాయకుడు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, బోథ్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, మండల నాయకులు కపిల్, హరిచంద్, ప్రవీణ్, రొహిదాస్, రాజేష్, హెమ్య నాయక్, ధనరాజ్ ఉన్నారు.

భీం వర్ధంతిని విజయవంతం చేయాలి



ఇచ్చోడ: మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

ఇచ్చోడ: మండల కేంద్రంలో గురువారం నిర్వహించే కుమురం భీం 84వ వర్ధంతిని విజయవంతం చేయాలని 23 గ్రామాల పటేళ్లు కోరారు. మండలంలోని మేడిగూడ రాయిసెంటర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. భీం వర్ధంతికి బోథ్ డివిజన్ స్థాయి ఆదివాసీలు, అనుబంధ, విద్యార్థి, ఉద్యోగ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో మేడిగూడ రాయి సెంటర్ సార్‌మేడి మెస్రం శంభు, పటేల్ భీంరావు, గ్రామాల పటేళ్లు ఆడ భీంరావు, కాత్లేరాము, సిడాం జ్యోతిరాం, సిడాం గంగారాం, టేకం దేవురావు, పెందుర్ భీంరావు పాల్గొన్నారు.

బోథ్: కుమురం భీం వర్ధంతిని విజయవంతం చేయాలని తుడుందెబ్బ నాయకులు కోరారు. మండలంలో భీం విగ్రహం వద్ద నిర్వహించే కార్యక్రమానికి ఆదివాసీలు, ఉద్యోగులు, గ్రామస్తులు తరలిరావాలని కోరారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి బోథ్ డివిజన్ అధ్యక్షుడు దుర్వ విశ్వేశ్వర్, మండల కమిటీ అధ్యక్షులు కనక అమృత్‌రావ్, మండాడి రాము ఉన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



బోథ్: నివాళులర్పిస్తున్న నాయకులు



తలమడుగు: నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు

తలమడుగు: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో బ్లూ భీం యూత్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బ్లూ భీం యూత్ అధ్యక్షుడు గొంటిముక్కుల ప్రేమేందర్ మాట్లాడుతూ రాష్ట్రపతి, క్షిపణి శాస్త్రవేత్త, సామాజిక సేవకుడిగా ఆయన దేశానికి సేవ చేశారని కొనియాడారు. గంగాధర్, గంగన్న, శివమణి, సందీప్, ఈశ్వర్, సాయి పాల్గొన్నారు.

బోథ్: సొనాలలో పూలే వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గాజుల పోతన్న ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధాన కార్యదర్శి బత్తుల రమేశ్, సభ్యులు అమృత్‌రావ్ పాటిల్, శేఖర్, గోరెభాయ్, అంకుష్, మహబూబ్, చెట్లపల్లి అనిల్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మనోజ్

ఆదిలాబాద్‌రూరల్: ప్రైవేట్ డిగ్రీ కళాశాలల విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు, బోధన సిబ్బంది ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీంతో యాజమాన్యాలు ప్రైవేట్ కళాశాలలను మూసి వేశాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెంటనే స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్క రాందాస్, జిల్లా కోశాధికారి లింగంపల్లి ప్రసన్నకుమార్, నాయకులు మోదీగంపెల్లి సుదర్శన్, గజ్జెల విలాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎదులాపురం: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. మూడేళ్లుగా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించకపోవడంతో కళాశాలల నిర్వహణ కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

డీజే వాహనం దగ్ధం



దగ్ధమవుతున్న వాహనం

బేల: మండలంలోని దేవాపూర్ రెవెన్యూ గ్రామ శివారులో డీజే వాహనం మంగళవారం దగ్ధమైంది. జైనథ్ మండలం మణికంఠ డీజే మేడిగూడ నుంచి బేల వైపు వస్తుండగా జనరేటర్‌లో తలెత్తిన విద్యుదాఘాతంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో డీజేతోపాటు వాహనం పూర్తిగా దగ్ధమైంది.

పీసీసీ అగ్రనేతలను కలిసిన 'కంది'

కైలాస్‌నగర్: టీపీసీసీ అగ్రనేతలు దీపాదాస్ మున్షీ, మహేశ్‌కుమార్ గౌడ్, ఏఐసీసీ సెక్రెటరీ విశ్వనాథన్‌ను కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశానికి హాజరైన అనంతరం వారిని కలిసి శాలువతో సత్కరించారు.

ఆటో తగులబెట్టారని ఫిర్యాదు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన జాదవ్ పండిత్ ఆటోను కాలనీకి చెందిన యువకులు తగులబెట్టారని బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు టూటౌన్ ఎస్సై విష్ణువర్ధన్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఆయన కథనం ప్రకారం.. సోమవారం రాత్రి జాదవ్ పండిత్ తన కిరాణా షాప్ మూసివేశాడు. కాలనీకి చెందిన శ్రీకాంత్, అతని స్నేహితులు షాపు వద్ద వచ్చారు. షాపు తెరిచి సామాగ్రి ఇవ్వాలని కోరగా ఆయన నిరాకరించడంతో ఆ యువకులే ఆటోను తగులబెట్టి ఉంటారని జాదవ్ పండిత్ ఫిర్యాదు చేశారు.

'సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాలి'

బోథ్: రాష్ట్రప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేకంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న కోరారు. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ధనూర్ (బి) గ్రామంలో మహిళలతో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో ముందుంటున్నారని, వారి కోసం పథకాలు ప్రవేశపడితే మరింత తోడ్పాటు అందించే అవకాశం ఉందన్నారు. సాయమ్మ, అశ్విని, ఉమ, రుక్మిణి, ప్రమీల, చంద్రకళ తదితరులు ఉన్నారు.

'పార్టీ బలోపేతానికి కృషి చేయాలి'

ఆదిలాబాద్: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. పార్టీ ఆదేశాలమేరకు సంగారెడ్డి జిల్లాలో మంగళవారం నిర్వహించిన సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేరడిగొండ: బీజేపీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని ఈనెల 20లోగా పూర్తి చేయాలని పార్టీ మండల సభ్యత్వ నమోదు కార్యక్రమ ఇన్‌చార్జి గుమ్మడి భీంరెడ్డి అన్నారు. మండలంలోని పీచర, నాగమల్యాల్, మాట్‌లొద్ది తదితర గ్రామాల్లో మంగళవారం పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు.

'ఏజెన్సీలో ఇందిరమ్మ కమిటీలు చట్టవిరుద్ధం'

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలో ఇందిరమ్మ కమిటీలు చట్ట విరుద్ధమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి ఆర్కా గోవింద్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో హక్కులు, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ అంతా పెసా గ్రామసభలకే ఉంటుందని తెలిపారు. గత ప్రభుత్వం తప్పిదాలను కాంగ్రెస్ యథావిధిగా కొనసాగిస్తోందన్నారు. ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా పని చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఇందిరమ్మ కమిటీ నియమకంలో గిరిజనులకు అవకాశం ఇవ్వాలన్నారు. మాడవి ఆనందరావు, శ్యామ్‌రావు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకా వేయించాలి



నేరడిగొండ: పశువులకు గాలికుంటు నివారణ టీకా వేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఇంద్రవెల్లి: ఏమాయికుంటలో పశువులకు టీకా వేస్తున్న అధికారులు



ఇచ్చోడ: పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి గోవింద్‌నాయక్

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: పాడి రైతులు పశువులకు గాలికుంటు నివారణ టీకా వేయించాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని రాజుర గ్రామంలో మంగళవారం ఉచిత సామూహిక గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పశువైద్యాధికారులు జీవన్ రాథోడ్, సునీల్ కుమార్, సిబ్బంది వెంకన్న, నరేందర్, శివప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండలంలోని ఏమాయికుంటలో పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి జులురి రవికుమార్ మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేశారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి, ముత్నూర్ పశువైద్యాధికారులు రాథోడ్ సుభాష్, సుదేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలో పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ మంగళవారం పశువులకు గాలికుంటు నివారణ టీకా వేశారు. పశు సహాయకురాలు సంధ్య, సిబ్బంది శేఖర్, శ్రీను పాల్గొన్నారు.

జరిమానా పేరిట అక్రమ వసూళ్లు



పంచాయతీ నుంచి తీసుకున్న అనుమతి పత్రాలు



నీలగిరి చెట్లు పెంచుతున్న పంట పొలం పట్టా

- అటవీశాఖ ఉద్యోగి నిర్వాకం
- రూ.30వేలు తీసుకుని రశీదు ఇవ్వని వైనం

ఆదిలాబాద్‌రూరల్: ఓ అటవీ శాఖ ఉద్యోగి అక్రమాలకు పాల్పడిన బాగోతం మంగళవారం బయటపడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మావల గ్రామానికి చెందిన రాజశేఖర్ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. మావలలో అతనికి రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో నీలగిరి చెట్లను పెంచుతున్నాడు. వీటిని కాగజ్‌నగర్‌కు చెందిన ఓ వ్యాపారికి విక్రయించాడు. మావల పంచాయతీ నుంచి అనుమతి పొందాడు. నరికిన చెట్లను లారీలో లోడ్ చేశారు. అయితే అక్కడికి వచ్చిన అటవీశాఖ ఓ కిందిస్థాయి ఉద్యోగి అనుమతి లేకుండా ఎలా చెట్లను నరికారని ప్రశ్నించారు. పంచాయతీ నుంచి అనుమతి తీసుకున్నామని సదరు ఉద్యోగికి వారు వివరించారు. జరిమానా చెల్లించాలని లేకపోతే లారీని అటవీశాఖ కార్యాలయానికి తీసుకెళ్తానని బెదిరింపులకు పాల్పడ్డారు. మొదట రూ.50 వేల జరిమానా చెల్లించాలని చెప్పారు. ఆ తర్వాత పంట చేను నిర్వహణ చూస్తున్న వ్యక్తి నుంచి రూ.30 వేలు తీసుకున్నట్లు తెలిపారు. కాగా, జరిమానా సంబంధించి రశీదు ఇవ్వాలని కోరగా, డబ్బులు తీసుకుని వెళ్లిపోయారు. ఈ విషయమై సదరు ఉద్యోగిని 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. అటవీ శాఖ రేంజ్ అధికారి గులాబ్‌సింగ్‌ను వివరణ కోరగా.. ఈ విషయం తన దృష్టికి రాలేదని, విచారణ చేపట్టి తీసుకున్న డబ్బులకు రశీదు ఇప్పించేలా చూస్తానని పేర్కొన్నారు.

ఎన్నికల హామీలు నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న సీతారాములు

ఎదులాపురం: కేంద్రంలోని బీజేపీ సర్కారు, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నిలబెట్టుకోవాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా 13వ మహాసభల ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా ఆయన జిల్లా కేంద్రానికి విచ్చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని సీసీఐని తిరిగి ప్రారంభిస్తామని ఎన్నికల సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్‌లు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. అలాగే జిల్లాలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు రవికుమార్, భీంరావు, మల్లేశ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాఘవులు, కిరణ్, సచిన్, దత్తాత్రి, ఆశన్న, కిష్టన్న, గంగన్న, సురేందర్, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి



పల్సి(బి) పంచాయతీ రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న డీఎల్‌పీవో ఫణిందర్

తలమడుగు: పారిశుధ్య నిర్వహణపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీవో ఫణిందర్ పేర్కొన్నారు. మండలకేంద్రంతోపాటు సుంకిడి, పల్సి(బి) గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల పంచాయతీల రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రోడ్లపై చెత్తా చెదారం, మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. సెగ్రిగేషన్ షెడ్డులో తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువును తయారుచేయాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఎంపీవో చిలుకూరి సుధీర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సచిన్, గ్రామస్తులు ఉన్నారు.

ఎస్సైపై చర్యలు తీసుకోవాలి

ఎదులాపురం: గిరిజన యువకులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆదిలాబాద్ రూరల్ ఎస్సైపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ నాయకుడు కుమ్ర జంగు పటేల్ కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం గిరిజన నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. సైద్‌పూర్ నుంచి రామాయి గ్రామం మీదుగా భీమ్‌సరికి పలువురు గిరిజనులను వెళ్తుండగా కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారన్నారు. ఆదిలాబాద్ రూరల్ ఎస్సైకి ఫిర్యాదు చేయగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. వాహనాలు ధ్వంసం చేయడం, గిరిజనులపై దాడి చేసినవారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ సంఘాల నాయకులు సోనేరావు, రాము, దేవిదాస్, రోహిదాస్, దత్తు, రాజు తదితరులు పాల్గొన్నారు.